## ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి అమిత్‌రెడ్డి శుభాకాంక్షలు



మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



యాదగిరిగుట్ట ప్రధానాలయంలో కలశాలను తీసుకొస్తున్న ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, చిత్రంలో మాజీ గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ దంపతులు

# ప్రజా పాలన దరఖాస్తులు 12.38 లక్షలు

**చివరి రోజు 1.53 లక్షల దరఖాస్తుల స్వీకరణ**

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముగిసిన కార్యక్రమం

నల్లగొండ, జనవరి 6 : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో 8 రోజులుగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 12.38 లక్షల దరఖాస్తులు వచ్చాయి. తొలి రోజు అంతంత మాత్రంగానే దరఖాస్తులు రాగా.. చివరి రోజు వాటి సంఖ్య గణనీయంగా పెరిగింది. చివరి రోజు శనివారం మూడు జిల్లాల్లో కలిపి లక్షా 53వేల దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,730 గ్రామపంచాయతీలు, 18 మున్సిపాలిటీల్లో ఈ దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. దరఖాస్తుల స్వీకరణను కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

ఎన్నికల హామీలో భాగంగా ఆరు గ్యారెంటీల అమలు కోసం కాంగ్రెస్ సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 28 నుంచి ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. రెండు రోజుల సెలవులు పోను 8 రోజులు ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో కౌంటర్ ఇన్‌చార్జిలు బాధ్యత తీసుకుని దరఖాస్తు ఫారాలు అందజేసి ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్ ప్రతులతో కలిపి స్వీకరించారు. ఈ దరఖాస్తుల్లో కుటుంబ వివరాలతోపాటు దరఖాస్తులకు అవసరమైన అంశాలను పొందుపరుస్తూ వాటి వివరాలను సేకరించారు. మహాలక్ష్మి పథకం కింద గృహిణికి రూ.2,500 ఆర్థిక సాయంతోపాటు ఉచిత గ్యాస్ కనెక్షన్, రైతు భరోసా కింద రైతు, కౌలురైతులకు పెట్టుబడి సాయం.. ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూతకు సంబంధించిన డేటాను పూర్తి స్థాయిలో సేకరించారు. ఈ సందర్భంగా ప్రజలు రేషన్ కార్డుతోపాటు ఆధార్ జిరాక్స్‌లను జత చేసి ఆయా గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభల్లో అందజేశారు.



సూర్యాపేటలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

**జిల్లాల వారీగా దరఖాస్తులు ఇలా..**

| | |
|---|---|
| నల్లగొండ | 6,10,875 |
| సూర్యాపేట | 3,62,203 |
| యాదాద్రి | 2,64,922 |

#### దరఖాస్తుదారుల్లో అయోమయం

అభయహస్తం కింద దరఖాస్తు చేసుకున్న ప్రజలు అయోమయంలో పడ్డారు. వాస్తవంగా ఆధార్, రేషన్ కార్డులు ఒక ప్రాంతంలో ఉన్నప్పటికీ కొంత మంది ఏండ్ల తరబడి ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. అటువంటి వారు సంబంధిత ధ్రువపత్రాలు ఉన్న ప్రాంతంలో దరఖాస్తు చేసుకోవాలా.. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో దరఖాస్తు చేసుకోవాలా? తెలియక అయోమయానికి గురయ్యారు. ప్రధానంగా సొంత ఇల్లు లేనివారు ఇందిరమ్మ ఇంటి కోసం ఉన్న ఊరిలో, జీవనం సాగిస్తున్న ప్రాంతంలో ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్లు ఉచితంగా ప్రభుత్వం ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో అద్దె ఇంట్లో ఉన్నవారు ఆ ఇంటి విద్యుత్ కనెక్షన్ నెంబర్ వేస్తే ఎలా.. ఆ తరువాత ఖాళీ చేస్తే వర్తిస్తుందో.. లేదోననే మీమాంసలో ఆ ఆప్షన్‌ను వదిలేశారు. రైతు భరోసాలో వాస్తవంగా కౌలు రైతులు భూమి కౌలుకు చేస్తున్నప్పటికీ అసలు రైతులు సర్వే నెంబర్ చెప్పడానికి ఇష్టపడకపోవడంతో కౌలు రైతు ఆప్షన్‌ను వదిలేశారు. గ్యాస్ వినియోగదారుల కనెక్షన్ స్వస్థలంలో ఉండి ఇతర ప్రాంతాల్లో నివాసముంటే వారు కూడా వర్తించదేమోనని ఆ ఆప్షన్‌ను వదిలేసినట్లు తెలుస్తున్నది.

## గుట్టలో వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

- కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు
- స్వామివారి సేవలో మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు

యాదగిరిగుట్ట, జనవరి 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంతోపాటు అనుబంధ పాతగుట్ట ఆలయంలో శనివారం స్వాతి నక్షత్రపు పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ప్రధాన ఆలయ ముఖమండపంలో శత కలశాలను ఏర్పాటు చేసి శుద్ధ జలాలకు పూజలు చేశారు. పంచామృతాలతోపాటు వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో స్వామివారి అష్టోత్తర శతఘటాభిషేకం చేపట్టారు. స్వాతి నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామునే భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో నారసింహస్వామిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సుమారు గంటన్నరపాటు జరిగిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన తిరువీధి, దర్బార్ సేవల్లో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయం లో ఆర్జిత పూజలు వైభవంగా జరిగాయి. ధనుర్మాసోత్సవం 21వ రోజులో భాగంగా ప్రధానాలయంలోని మొదటి ప్రాకార మండపంలో అర్చకులు వేద మంత్రాలను పఠిస్తూ తిరుప్పావై పూజలు చేపట్టారు. అర్చకులు గోదాదేవి, రంగనాయకుడిపై రచించిన పాశురాలను పఠించారు. సుమారు 18 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఖజానాకు రూ.29,40,458 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

#### స్వాతి నక్షత్ర పూజల్లో పాల్గొన్న మాజీ గవర్నర్ దంపతులు..

లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి పూజల్లో మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయన అక్కడే బస చేశారు. శనివారం తెల్లవారుజామున అష్టోత్తర శత ఘటాభిషేకంలో భాగంగా నిర్వహించిన కలశ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పంచనారసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు మాజీ గవర్నర్ దంపతులకు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ రామకృష్ణారావు స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి దంపతులు, ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు, ఏఈఓ రఘు, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆలయ అధికారులు సురేందర్‌రెడ్డి, రాజన్‌బాబు, సింహాచార్యులు పాల్గొన్నారు.

## పీఎం జన్‌మన్‌తో ఆదివాసీ, చెంచు గ్రామాల అభివృద్ధి

- ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నీలగిరి, జనవరి 6 : ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం – జన్ మన్) కార్యక్రమం ద్వారా ఆదివాసీ, చెంచు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి సంపూర్ణ అభివృద్ధి చేయనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం పీఎం – జన్‌మన్ కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని 2023 – 24 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 – 26 వరకు అమలు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి రూ.24,104 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. జిల్లాలోని పెద్దవూర, చందంపేట, గుండ్లపల్లి, నేరేడుగొమ్ము మండలాల పరిధిలో నెల్లికల్, చిత్రియాల, గోనబోయినపల్లె, కంబాలపల్లి, రేకుల వలయం, పొగిళ్ల, తిమ్మాపూర్, గన్నెర్లపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని చెంచు ప్రజలకు ఈ సంక్షేమ కార్యక్రమాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పథకంలో పక్కా గృహాలు, అనుసంధాన రోడ్లు, కుళాయి నీటి సరఫరా, హాస్టళ్ల నిర్మాణం, వృత్తి విద్యా నైపుణ్యాభివృద్ధి, సంచార మెడికల్ వైద్య సేవలు, అందరికీ పోషకాహారం, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, ఉన్నత జీవన ప్రమాణాలు, మారుమూల ప్రాంతాలకు టెలిఫోన్ సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

#### నేడు జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుల పర్యటన

నీలగిరి, జనవరి 6 : జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వవా ఆదివారం నల్లగొండలో పర్యటిస్తున్నారని, జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖకు సంబంధించి సఫాయి కర్మచారిల జాతీయ కమిషన్ సభ్యులు వస్తున్నందున ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని నల్లగొండ ఆర్డీఓను ఆదేశించారు. 8న అన్ని మున్సిపాలిటీల సమావేశానికి తగిన ఏర్పాట్లు చేయాలని, దానికి సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రాజ్‌కుమార్, ఆర్డీఓలు రవి, చెన్నయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బరాఖత్‌గూడెం వేంకటేశ్వర ఆలయంలో డిప్యూటీ సీఎం భట్టి పూజలు



వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మునగాల, జనవరి 6 : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కందాళ శ్రీనివాసాచార్యులు, ప్రశాంతాచార్యులు పూర్ణకుంభంతో ఆయకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ చరిత్రను వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తన సన్నిహితులకు ఇచ్చిన హామీ మేరకు స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. శ్రీవారి ఆశీస్సులు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి ఆలయానికి వస్తున్నాడని తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ముఖ్య నాయకులతో వెళ్లి ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఎంపీపీ ఎలక బిందు నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చి పాపయ్య, ఎడమ కాల్వ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, కోదాడ మాజీ ఎంపీపీ వంగవేటి రామారావు పాల్గొన్నారు.

## నల్లగొండ మున్సిపాలిటీకి ఓడీఎఫ్ ++ గుర్తింపు

నీలగిరి, డిసెంబర్ 6 : కేంద్ర ప్రభుత్వం నిర్వర్తిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నల్లగొండ మున్సిపాలిటీ ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌గా గుర్తిం పు సాధించిందని మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుధ్యం, పబ్లిక్ కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణలో ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రత్యేక బృందం అక్టోబర్ నెలలో నల్లగొండ పట్టణంలో పర్యటించి మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌గా గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా నల్లగొండను బహిరంగ మల మూత్ర విసర్జన రహిత పట్టణంగా గుర్తించడం గర్వంగా ఉన్నదని పేర్కొన్నారు. అందులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

#### ఓడీఎఫ్ +గా హాలియా మున్సిపాలిటీ

హాలియా : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హాలియా మున్సిపాలిటీ ఓడీఎఫ్ ప్లస్ గుర్తింపు పొందిందని మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణలో ఈ ప్రాధాన్యం లభించిందని పేర్కొన్నారు. హాలియా పట్టణానికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు దక్కడం గర్వంగా ఉన్నదని, అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. హాలియాను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులు, పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# టీ-నేతన్న

### చేనేత కార్మికులకు యాప్ అందుబాటులోకి..

- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు
- ఫోన్ నుంచే అప్‌లోడ్ చేసే వెసులుబాటు
- రిజిస్ట్రేషన్ చేసుకుంటే పథకాల ప్రయోజనం
- ఆన్‌లైన్‌లోనే ప్రభుత్వ పథకాల వర్తింపు
- ఈ నెల 15 వరకు తుది గడువు



యాదాద్రి భువనగిరి, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : నేత కార్మికుల కోసం ప్రభుత్వం టీ–నేతన్న యాప్ తీసుకొచ్చింది. గతేడాది కేసీఆర్ సర్కారు హయాంలోనే యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఇందులో చేనేత, పవర్‌లూమ్ కార్మికులు, అనుబంధ కార్మికుల వివరాలు పొందుపర్చాలి. అర్హులైన కార్మికులు తప్పకుండా నమోదు చేసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేతన్నల కోసం అందిస్తున్న వివిధ పథకాల రాయితీ డబ్బులను నేరుగా వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయడానికి వీలుగా యాప్‌ను తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ పథకాలను పొందేందుకు కూడా ఇది ఉపయోగపడుతుంది. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

#### రిజిస్ట్రేషన్ ఇలా..

జిల్లాలో సుమారు 10 వేల మంది నేత కార్మికులు ఉన్నారు. భూదాన్ పోచంపల్లి, నారాయణపురం, భువనగిరి, చౌటుప్పల్, రామన్నపేట, ఆలేరు, యాదగిరిగుట్ట తదితర మండలాల్లో అధికంగా చేనేత కార్మికులు ఉన్నారు. వీరంతా టీ–నేతన్న యాప్‌లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కార్మికులంతా ఇంటి నుంచే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందుకోసం మొదటగా ప్లే స్టోర్ నుంచి టీ–నేతన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రధాన వీవర్, అనుబంధ కార్మికుడు వేర్వేరు ఫోన్ నంబర్లతో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత న్యూ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేసి ఈ–కేవైసీ, అడ్రస్, మగ్గం వివరాలు, బ్యాంక్ వివరాలు, ప్రస్తుత మగ్గం కార్మికుల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి.



#### ప్రతి కార్మికుడు నమోదు చేసుకోవాలి

ప్రతి కార్మికుడు ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని జియో ట్యాగింగ్‌తోపాటు పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలి. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సంక్షేమ పథకాలు వర్తించే అవకాశం ఉంది. ఈ నెల 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని నేతన్నలంతా సద్వినియోగం చేసుకోవాలి.

– విద్యాసాగర్, ఏడీ, చేనేత, జౌళి శాఖ



బహుమతులు, షీల్డులతో క్రీడాకారులు


## సూర్యాపేటలో ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్

- ఫైనల్ పోటీలను ప్రారంభించిన కలెక్టర్ ఎస్.వెంకట్రావ్
- విజేతలకు బహుమతుల ప్రదానం

సూర్యాపేట అర్బన్, జనవరి 6 : ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ కళాశాలల స్థాయి స్పోర్ట్స్‌మీట్‌ను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. పట్టణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్ మాట్లాడుతూ 1938లో స్థాపించిన ఎగ్జిబిషన్ సొసైటీ దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనను ప్రతి సంవత్సరం జనవరి 1నుంచి ఫిబ్రవరి 15 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నదన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయంతో 20 విద్యా సంస్థలను స్థాపించి 30వేల మంది విద్యార్థులకు విద్య అందిస్తున్నదని తెలిపారు. ఈ 20 విద్యాసంస్థల విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సూర్యాపేటలోని ఎస్వీ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించినట్లు వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ సెక్రటరీ పి.హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ చంద్రజిత్‌సింగ్, మంజిత్‌రెడ్డి, ఎం.రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, జయ ఆదిత్యరెడ్డి, శ్రీ వేంకటేశ్వర కళాశాల సెక్రటరీ ఎం.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రాజు, డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్, కళాశాల పీడీలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ చేశాం

- ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు మున్సిపల్ చైర్మన్ వినతి



ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి

నల్లగొండ, జనవరి 6 : నల్లగొండ బీఆర్ఎస్ కౌన్సిలర్లకు పార్టీ విప్ జారీ చేసినట్లు మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి శనివారం ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్న బీఆర్ఎస్‌కు చెందిన మందడి సైదిరెడ్డిపై అవిశ్వాసం కోరుతూ పలువురు కౌన్సిలర్లు గత నెల 22న కలెక్టర్‌కు నోటీస్ ఇచ్చారు. దాంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 8న ఉదయం 11:30 గంటలకు అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. అయితే.. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 20 మంది సభ్యులు కారు గుర్తుపై పోటీ చేసి కౌన్సిలర్లుగా గెలుపొందారు. వారిలో మెజార్టీ సభ్యులు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ తరఫున గెలిచిన కౌన్సిలర్లు ఇతరులకు మద్దతు ఇవ్వవద్దని ఆదేశిస్తూ పార్టీ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి ఇటీవల విప్ జారీ చేశారు. ఈ విషయాన్ని తెలుపుతూ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

## ప్లాస్టిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

- స్టేట్ ప్రాజెక్ట్ అధికారి రాధిక



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్టేట్ ప్రాజెక్టు అధికారి రాధిక

సూర్యాపేట అర్బన్, జనవరి 6 : విద్యార్థులకు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించి దాని వినియోగాన్ని తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని స్టేట్ ప్రాజెక్ట్ అధికారి టి.రాధిక అన్నారు. జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో తెలంగాణ స్టేట్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రామా, మోనోయాక్షన్ పోటీలను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీలను 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించామని, ఇందులో జిల్లాలోని 30కి పైగా పాఠశాలల విద్యార్థులు 200 మంది పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై విద్యార్థులకు డ్రామా, మోనోయాక్షన్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. డ్రామా పోటీల్లో సూర్యాపేట జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ విద్యార్థినులు ప్రథమ బహుమతి, జడ్పీహెచ్ఎస్ పాలవరం ద్వితీయ, ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ తృతీయ బహుమతి గెలుచుకున్నాయన్నారు. మోనోయాక్షన్‌లో కేజీబీవీ నూతనకల్ మొదటి బహుమతి, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ నడిగూడెం ద్వితీయ, సూర్యాపేట జీహెచ్ఎస్ నెం.2 విద్యార్థులు తృతీయ బహుమతి గెలుపొందినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు మొదటి బహుమతిగా రూ.3వేలు, ద్వితీయ (రూ.2వేలు), తృతీయ బహుమతిగా వెయ్యి రూపాయల నగదుతోపాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, దేవరాజ్, బండి రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.